# ఆధ్యాత్మికతకు నిలయంగా కరీంనగర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

- ఎన్నికల్లో ఆశీర్వదిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 3: కరీంనగర్‌లో ఓ వైపు అభివృద్ధితో పాటు ఆధ్యాత్మికతకు నిలయంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగరంలోని 14, 15, 16వ డివిజన్లలో శుక్రవారం రాత్రి ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఆయా డివిజన్లలో పార్టీ శ్రేణులు, మహిళలు, ప్రజలు మంగళహారతులు, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, స్వరాష్ట్రంలో నగరం ఎంత అభివృద్ధి చెందిందో ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రానికి పట్టిన దారిద్ర్యం కాంగ్రెస్, బీజేపీలు అన్నారు. నగరంలో రాత్రిళ్లు వెలుగులు జిగేల్‌మనేలా అభివృద్ధి చేశామన్నారు. తనను మరోసారి ఆశీర్వదిస్తే మరింతగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ప్రతి ఏటా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పద్మనగర్‌లో వేంకటేశ్వర స్వామి, నగర శివారులో ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అభివృద్ధిలో ముందుకు సాగుతుంటే మళ్లీ రాష్ట్రంలో దొంగలు పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ముసుగులో కిరణ్‌కుమార్‌రెడ్డి, షర్మిల వచ్చి హైదరాబాద్‌లో ఉన్నారని విమర్శించారు. తెలంగాణ సంపదపై కన్నేసి కేసీఆర్ ఓడిపోతే తెలంగాణను ఆంధ్రాలో కలిపి సంపదను దోచుకుపోవడానికి కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. తెచ్చుకున్న తెలంగాణను మళ్లీ దొంగల చేతుల్లో పెట్టవద్దన్నారు. విలువైన ఓటు విషయంలో తప్పు చేస్తే మన బిడ్డల భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. మీ కళ్ల ముందు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. కొత్తగా పోటీకి వచ్చేవాళ్లు కేవలం తమ ఆస్తులను కూడబెట్టుకునేందుకే వస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు శ్రీకాంత్, మహేశ్, నాయకులు కట్ట సత్తయ్య, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మీరు చేస్తే పూజలు.. కేసీఆర్ చేస్తే క్షుద్రపూజలా



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

- బండి సంజయ్ మాటలు నమ్మి యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, నవంబర్ 3: బీజేపీ నాయకుడు బండి సంజయ్ చేస్తే పూజలు, సీఎం కేసీఆర్ యాగం చేస్తే దాన్ని క్షుద్రపూజలు అంటారా అని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ప్రశ్నించారు. నగరంలోని 37వ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, శాంతియుతంగా ఉండాలన్న ఆకాంక్షతో సీఎం కేసీఆర్ యాగం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ యాగానికి ఎందరో పీఠాధిపతులు కూడా హాజరైనట్లు గుర్తు చేశారు. పీఠాధిపతులను కూడా అవమానించే విధంగా బండి సంజయ్ మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బండి సంజయ్ వారి పార్టీ సమావేశాల్లో దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపించారు. మతాలు, కులాలపై మాట్లాడితే చెల్లు బాటు కావడం లేదని, కుటుంబ సెంటిమెంట్ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు డబ్బు సంచులతో వస్తున్నారని బండి సంజయ్ తెలంగాణ ఓటర్లను అవమానించారని ఆరోపించారు. తెలంగాణ ఓటర్లు డబ్బులకు అమ్ముడుపోయే వారిగా బండి సంజయ్‌కి కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు.? వెంటనే తెలంగాణ ఓటర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో తిరిగితే ప్రజలు ఎంపీగా ఏం చేశావని నిలదీస్తారన్న భయంతోనే ఆ పార్టీ అధిష్ఠానానికి విన్నవించుకొని స్టార్ క్యాంపెయినర్ పేరుతో తప్పించుకుంటున్నారని విమర్శించారు. కరీంనగర్ ప్రజలు కూడా బండి సంజయ్‌కి బాయ్ బాయ్ చేప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, చేతి చంద్రశేఖర్, ఆరె రవిగౌడ్, హరీశ్, సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఆకస్మిక తనిఖీ

రాంనగర్, నవంబర్ 3: నగరంలోని గాంధీచౌక్‌లో కరీంనగర్ టౌన్ పోలీసులు ఏసీపీ నరేందర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద లక్షా 31 వేల 500 నగదు స్వాధీనం చేసుకుని రిటర్నింగ్ అధికారికి సమాచారం ఇచ్చి డిపాజిట్ చేసినట్లు ఏసీపీ నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా గాంధీచౌక్‌లో స్థానికులకు ఎన్నికల నిబంధనలతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లుకు సన్మానం

కలెక్టరేట్, నవంబర్ 3: వయోవృద్ధుడు, సీనియర్ సిటిజన్స్ ఫోరం సలహాదారు రాపర్తి వెంకటేశ్వర్లును జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర్లు 84వ పుట్టిన రోజును పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లుకు శాలువా కప్పి, సత్కరించారు. సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రావు, సభ్యులు మరిపల్లి మహేందర్, ఆస సతీశ్, రాంశంకర్, సుధాకర్, నరేశ్, మహేశ్వరి, రాపర్తి లత, తేజస్విని పాల్గొన్నారు.

## వృద్ధులకు వైద్య పరీక్షలు

కొత్తపల్లి, నవంబర్ 3: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వయో వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా బ్రాంచ్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి, కార్యదర్శి ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 150 మందికి ఉచితంగా పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కోశాధికారి శ్రీహరిరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి, సరస్వతి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

## పోలీస్ స్టేషన్ తనిఖీ

రాంనగర్, నవంబర్ 3: చొప్పదండి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ తాండ్ర కరుణాకర్ రావు, చొప్పదండి సీఐ గోపతి రవీందర్, ఎస్ఐ ఉపేంద్రాచారి, గంగాధర ఎస్.ఐ. అభిలాష్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నామినేషన్ సెంటర్ల పరిశీలన

రాంనగర్, నవంబర్ 3: కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గ నామినేషన్ సెంటర్లను శుక్రవారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలోని నామినేషన్ సెంటర్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ సెంటర్‌కు అభ్యర్థులతో వచ్చే నాయకులను కట్టడి చేయడానికి 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

# కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం

- మతిభ్రమించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 3: కాళేశ్వరం ప్రాజెక్టుపై కనీస పరిజ్ఞానం, దాని స్వరూపం తెలుసుకోకుండా మతిభ్రమంచి కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మేయర్ యాదగిరి సునీల్‌రావు విమర్శించారు. రూ.80 వేల కోట్లతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ ఒక బ్యారేజీ అని, అక్కడ సాంకేతిక సమస్యతో ఇబ్బంది వస్తే మొత్తం ప్రాజెక్టు పోయిందన్నట్లు మతిభ్రమించి కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మూడు బ్యారేజీలు, 19 పంపుహౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగ మార్గం, 1531 కిలోమీటర్ల గ్రావిటి కెనాళ్లు కాంగ్రెస్ నాయకుల కండ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.? స్థానిక ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డ బ్యారేజీని చూసేందుకు వెళ్లినందుకు స్వాగతిస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై రాహుల్ గాంధీ నుంచి కిందిస్థాయి నాయకుడి వరకు అందరూ మాట్లాడుతున్నారని విమర్శించారు. వారికి కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన ఉందా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ.80 వేల కోట్లతో నిర్మిస్తే మేడిగడ్డ బ్యారేజీని రూ.1848 కోట్లతో 1632 మీటర్ల పొడవుతో, 85 గేట్లతో నిర్మించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ అని కాంగ్రెస్ నాయకులు భ్రమపడుతూ ప్రజలను కూడా తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రతి రోజు 2 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి, 240 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసుకొని 13 జిల్లాలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్క బ్యారేజీలో సాంకేతిక సమస్యతో ఒక్క పిల్లర్ కుంగితే నిర్మాణ సంస్థ మళ్లీ మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చిందని, తెలంగాణ ప్రజలను, రైతులను మభ్యపెట్టేలా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అద్భుతమైన ప్రాజెక్టును మూడేళ్లలోనే పూర్తి చేసిన విషయం వారికి కనిపించడం లేదన్నారు. తెలంగాణలో ఎక్కడ కూడా కరువు పరిస్థితులు లేకుండా చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారం కోసం అమలు కాని హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. దమ్ముంటే మీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి ప్రాజెక్టులు, ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలు చేపట్టాలని హితవు పలికారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మరోవైపు బండి సంజయ్ కరీంనగర్‌లో మేయర్ స్థానాన్ని ఎంఐఎంకు ఇస్తారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీగా గెలిచి ఏ రోజైనా ప్రజల మధ్యలో ఉన్నారా అని ప్రశ్నించారు.? ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు గంట కళ్యాణి, గందె మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, రాములు, యాదయ్య, చాడగొండ బుచ్చిరెడ్డి, ఐలేందర్, నాయకులు అర్ష మల్లేశం, అనిల్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టరేట్, నవంబర్ 3: కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి రవీందర్ పిలుపునిచ్చారు. నగరంలోని కిమ్స్ విద్యా సంస్థల్లో స్వీప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఇటీవల దరఖాస్తులు చేసుకున్న వారు తమ ఓటరు ఐడీ కార్డును ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవీందర్‌రావు, వైస్ చైర్మన్ సాకేత్‌రావు, అర్జున్‌రావు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

కరీంనగర్ రూరల్, నవంబర్ 3: చెర్లభూత్కూర్‌లో దుర్శేడ్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సంఘం సీఈవో మ్యాకల రమేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో రమేశ్, దబ్బెట రమణారెడ్డి, నరహరి ప్రవీణ్‌రెడ్డి, రాజమల్లు, రాజు, హమాలీ సంఘం నాయకులు సింగిల్ విండో సిబ్బంది పాల్గొన్నారు.

## కరపత్రం ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3 : ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ఆధ్వర్యంలో వందే విశ్వ మాతరం పేరిట ఈనెల 9 నుంచి చిగురుమళ్ల శ్రీనివాస్ 1080 దేశాల్లో రెండేళ్ల పాటు నిర్వహించనున్న సాహిత్య, సాంస్కృతిక, సామాజిక చైతన్య ప్రపంచ యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని హైదరాబాద్‌లో సమైక్య సాహితి ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. సంస్థ అధ్యకుడు గోపాల్, సురభి జయచంద్ర, ఆనంద్ ఉన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు